# 175. దృక్పథం

నిజమైన ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపే ఒకతను కారు నడుపుకుంటూ వెళ్తూంటే, ఓ ఇంట్లోంచి అకస్మాత్తుగా బయటకి వచ్చిన ఓ కోడి అతని కారు కింద పడి మరణించింది. ఆ రోడ్డు పక్కనే కాలువ గట్టున గుడిసెలు వేసుకుని అనేకమంది బీదవాళ్ళు నివసిస్తున్నారు. కారాపి దిగాడతను. ఆ కోడి యజమాని కోపంగా చూస్తూ ఆ కారు యజమానిని ఓ దెబ్బ వేసి తిట్టాడు. ఆ అరుపులకి మిగిలిన గుడిసెల్లోని వాళ్ళంతా బయటకి వచ్చి జరిగింది గ్రహించి, అతన్ని తలో దెబ్బా వేసారు. అతని ఒంటి మీది దుస్తులు చిరిగిపోయాయి.

ఎదురు తిరగకుండా వాళ్ళకి ఉపశమనం కలిగేదాకా ఆగి, తర్వాత అతను కారెక్కబోతూంటే, ఇదంతా గమనించిన ఇంకో కారు యజమాని సానుభూతిగా చూస్తూ చెప్పాడు.

"మీ ఒళ్ళు రక్తసిక్తం అయేలా కొట్టారు. రండి. వెళ్ళి పోలీసులకి రిపోర్టు చేద్దాం."

"వీళ్ళు నన్నెప్పుడు కొట్టారు?"

"ఇప్పుడు జరిగింది అదేగా?"

"పిచ్చివాడా! బీదరికం వల్ల వీళ్ళల్లో రగిలే కోపాన్ని కొంత తీర్చుకోడానికి కారున్న నేను వాళ్ళకి కనిపించాను. అంతే తప్ప వాళ్ళు నామీద వ్యక్తిగత కోపంతో నన్ను కొట్టలేదు." చెప్పాడు ఆ ఆధ్యాత్మిక మనిషి.

# 176. ఏకాగ్ర భక్తి

మారుతి అతని పేరుకి తగ్గట్టుగా గొప్ప రామ భక్తుడు. రాముడు ఏదో రూపంలో వచ్చి తనకి కనబడతాడని అతని ఆశ, ప్రగాఢ విశ్వాసం. కాని ఎప్పుడు వస్తాడో మాత్రం తెలీదు. త్వరగా రావచ్చన్న ఆశతో రామ నామ స్మరణ చేస్తూ, ఆయన కోసం ఎదురు చూపులు చూస్తూ జీవించసాగాడు.